క్లుప్తంగా


స్నేహితుడి కుటుంబానికి చేయూత



బ్యాంక్ డిపాజిట్ ధ్రువపత్రం అందజేస్తున్న స్నేహితులు

గరిడేపల్లి : మండలంలోని కీతవారిగూడెం గ్రామానికి చెందిన వల్లభనేని వెంకటేశ్వరరావుతో పాటు అతని భార్య ఇటీవల మృతి చెందారు. దీంతో వెంకటేశ్వరరావుతో పాటు 8 నుంచి 10వ తరగతి వరకు కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా కలిసి అతని కూతురు పేరు మీద రూ.50 వేలను బ్యాంక్‌లో డిపాజిట్ చేసి అండగా నిలిచారు. సదరు ధ్రువపత్రాలను మంగళవారం అందజేశారు. దీంతో పలువురు వారిని అభినందించారు.

ఆధారాలు లేకుండా నగదు తరలిస్తే సీజ్ చేస్తాం : ఎస్ఐ



చిలుకూరులో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ రాంబాబుగౌడ్

చిలుకూరు : ఎన్నికల కోడ్ నేపథ్యంలో చిలుకూరు మండల కేంద్రంలో పోలీసులు మంగళవారం వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాంబాబు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఆధారాలు లేకుండా డబ్బులు తీసుకెళితే సీజ్ చేస్తామని అన్నారు. ప్రతిఒక్కరూ ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలన్నారు. లేనిచో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శి



ఎమ్మెల్యే పద్మావతి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న గుండు వెంకటేశ్వర్లు

చిలుకూరు : చిలుకూరు మండల కేంద్రానికి చెందిన రిటైర్డు పంచాయతీ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు బుధవారం ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితుడై కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వెంకటేశ్వర్లు తెలిపారు.

అక్రమ కట్టడం కూల్చివేత



జాన్‌పహాడ్ రోడ్డులో అక్రమ కట్టడాన్ని కూల్చివేస్తున్న మున్సిపల్ అధికారులు

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని జాన్‌పహాడ్ రోడ్డులో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాన్ని మంగళవారం మున్సిపల్ అధికారులు జేసీబీతో కూల్చివేశారు. అయితే మున్సిపాలిటీలోని జాన్‌పహాడ్ రోడ్డు, రాంపురం రోడ్డు, మున్సిపల్ రోడ్ల విస్తరణను 15 కోట్ల నిధులతో చేపట్టారు. జాన్‌పహాడ్ రోడ్డును ఇరువైపులా 33 ఫీట్ల మేర వెడల్పు చేస్తూ అడ్డం వచ్చిన కట్టడాలను తొలగించి రోడ్డుకు ఇరువైపుల ప్రధాన డ్రెయినేజీ నిర్మించారు. ప్రధాన డ్రెయినేజీని ఆక్రమించి నిర్మాణం చేపడుతున్న కట్టడాన్ని మున్సిపల్ అధికారులు కూల్చివేశారు.

ఆంజనేయస్వామికి ఆకుపూజ



బూరుగడ్డలోని గోశాలకు పశుగ్రాసం అందజేస్తున్న దాతలు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలో ఆంజనేయస్వామికి మంగళవారం ఆకుపూజను అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, మంగళాశాసనం, ఆంజనేయస్వామికి పంచామృతాలు, 108 తమలపాకులతో అభిషేకం, ఆకుపూజ, గంధ సింధూరం, మన్యసూక్త పారాయణం, శ్రీరామ, ఆంజనేయ అష్టోత్తర శతనామావళి, అలంకరణ, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, ఆలయంలోని గోశాలకు నల్లగొండకు చెందిన వీరవెల్లి శ్రీహరి రూ.15 వేల విలువ గల పశుగ్రాసం, తవుడు బస్తా, చిలుకూరు మండలం బేతవోలు గ్రామానికి చెందిన కొండా వెంకయ్య– అచ్చమ్మ దంపతులు సుమారు రూ. 10 వేల విలువ గల పశుగ్రాసాన్ని ఆలయ ఈఓ లక్ష్మణరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ముదుంబై హరీష్‌కుమార్‌చార్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

‘డబుల్’కు వీడని గ్రహణం

- కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలం
- ఇళ్ల కోసం ఆశగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులు
- మంత్రి ఉత్తమ్ దృష్టి సారించి సౌకర్యాలు కల్పించాలని వేడుకోలు



కోదాడ పట్టణ సమీపంలోని బాలాజీనగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయం

కోదాడ : గత ఐదు ఏళ్లుగా సాగుతున్న కోదాడ డబుల్ బెడ్ రూం ఇళ్ల వ్యవహారం ఇప్పట్లో కొలిక్కి వచ్చే సూచనలు కనిపించడం లేదు. ఉమ్మడి జిల్లాలో అతిపెద్ద డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయం ఇది. ఇళ్ల నిర్మాణం పూర్తయినప్పటికీ అంతర్గత రోడ్లు, డ్రైన్‌లు, విద్యుత్ సౌకర్యం కల్పించకుండా వదిలేయడంతో ఇళ్లు నిరుపయోగంగా ఉన్నాయి. ప్రారంభం కాక ముందే శిథిలావస్థకు చేరుకున్నాయి. అసెంబ్లీ ఎన్నికల ముందు నాటి ప్రభుత్వం హడావుడి చేసి గృహ ప్రవేశాల కార్యక్రమం కూడా నిర్వహించి వదిలేసింది. త్వరలోనే మౌలిక వసతులను కల్పిస్తామని చెప్పినా అది ఆచరణకు నోచుకోలేదు. ఈ లోగా ప్రభుత్వం మారడం వీటిపై దృష్టి సారించకపోవడంతో ఈ ఇళ్ల సమస్య ఇప్పట్లో తీరే సూచనలు కనిపించడం లేదు.

పనులు ఆగుతూ.. సాగుతూ..

కోదాడ మున్సిపాలిటీ పరిధిలోని బాలాజీనగర్ వద్ద రూ.32.24 కోట్లతో 560 డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించారు. అయితే తెలంగాణ ఏర్పడిన తరువాత రెండవసారి జరిగే ఎన్నికలకు కొద్ది నెలల ముందు 2018 మార్చి 7న ఇళ్ల నిర్మాణానికి అప్పటి ఐటీ, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రెండవసారి అధికారంలోకి వచ్చిన తరువాత 2019లో ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించారు. అయితే కాంట్రాక్టర్‌కు సకాలంలో బిల్లులు రాకపోవడంతో పనులు ఆగుతూ.. సాగుతూ వచ్చాయి. ఇక 2023 ఎన్నికలకు ముందు పనులు అసంపూర్తిగా ఉండగానే లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ ఎంపిక కూడా పారదర్శకంగా జరగలేదనే విమర్శలు ఉన్నాయి. ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని హడావుడిగా ఒక ఇంట్లో గృహప్రవేశం కూడా నిర్వహించారు. ఇక్కడ మౌళిక వసతుల కోసం వెంటనే నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. పనులు ప్రారంభించి డ్రెయినేజీ, మంచినీటి పైప్‌లైన్ పనులు పూర్తి చేశారు. ఇంకా అంతర్గత రోడ్లు, విద్యుత్ సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది. ఈలోగా మరోసారి ఎన్నికలు రావడంతో వీటి గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

మంత్రి దృష్టి సారిస్తే..

కోదాడ డబుల్ బెడ్ ఇళ్ల సముదాయానికి డ్రెయినేజీ, తాగునీటి పైప్‌లైన్ పనులు పూర్తి చేశారు. అంతర్గత రోడ్లు, విద్యుత్ సౌకర్యం కల్పించాల్సి ఉంది. దీని కోసం దాదాపు రూ.5 కోట్లు అవసరం అవుతాయని అంచనా. ఈ నిధుల కోసం మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి దృష్టి సారించి నిధులు మంజూరు చేయించాలని గృహ లబ్ధిదారులు కోరుతున్నారు.

ఎన్నికల కోడ్ ముగియగానే పనులు పూర్తి చేయిస్తా



గత ప్రభుత్వం బాలాజీనగర్ వద్ద నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లకు కనీస వసతులు కల్పించకుండా ఐదు సంవత్సరాలు కాలయాపన చేసింది. ఇళ్ల విషయంపై మేం దృష్టి సారించేలోపే పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చింది. ఎన్నికల కోడ్ ముగియగానే మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో నిధులు మంజూరు చేయించి పనులు పూర్తి చేయించే బాధ్యత నాది. పేదలకు అండగా మా ప్రభుత్వం ఉంటుంది.

– నలమాద పద్మావతి, కోదాడ ఎమ్మెల్యే

అనేక ఏళ్లుగా ఈ ఇళ్లు ఖాళీగా ఉండడంతో తలుపులు, కిటికీలు పాడై పోతున్నాయని, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎండా కాలంలోనూ నిండా నీరు



పురాతన రామాలయంలోని కోనేరు

చిలుకూరు : వర్షాభావ పరిస్థితులు, తీవ్ర ఎండల ప్రభావంతో భూగర్భ జలాలు పడిపోయి బోర్లు, బావులు వట్టిపోయాయి. గ్రామాల్లో పురాతన బావులు సైతం ఎండిపోయాయి. కానీ పాత చిలుకూరులోని పురాతన రామాలయంలో క్రీ.శ 960వ సంవత్సరంలో చాణిక్యులు నిర్మించిన కోనేరులో నీరు ఏమాత్రం తగ్గలేదు. ఎండకాలం కావడంతో ప్రతిరోజూ మధ్యాహ్న సమయంలో కోనేరులో చిన్నారులు ఈత కొడుతున్నారు.

శ్రీరామనవమికి ముస్తాబు

- రెండో భద్రాద్రిగా తమ్మరలోని సీతారామచంద్ర ఆలయం ప్రసిద్ధి
- భద్రాచలంలో మాదిరిగా పూజలు
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ సభ్యులు



ముస్తాబైన తమ్మరలోని సీతారామచంద్రస్వామి ఆలయం

కోదాడరూరల్ : చారిత్రక నేపథ్యంతో పాటు రాష్ట్రంలో రెండవ భద్రాద్రిగా పేరొందిన కోదాడ పట్టణ పరిధిలోని తమ్మరలో గల శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం బుధవారం జరిగే శ్రీ రామనవమి వేడుకలకు ముస్తాబైంది. వెయ్యేళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయంలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. భద్రాచలంలో ఏ విధంగా పూజలు జరుగుతాయో అదేవిధంగా ఇక్కడ నిర్వహిస్తారు. నాలుగు చేతుల వైకుంఠరాముడు ఈ దేవాలయం ప్రత్యేకత. అదేవిధంగా భద్రాచలంలో మాదిరిగానే రామకోటి ఉత్సవాలను కూడా వైభవంగా జరుపుతారు. ఆలయంలో రామకోటి స్తంభం భద్రాచలంలో మాదిరిగానే నిర్మించారు. అనంతగిరి మండలం కిష్టాపురానికి చెందిన కత్రం వంశీయులు సీతమ్మ తరపున తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించడం ఇక్కడ ఆనవాయితీ. వారే స్వయంగా స్వామివారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు కుటుంబసమేతంగా తీసుకొస్తుంటారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు కోదాడ ప్రాంతం నుంచే గాక పక్కనే ఉన్న ఖమ్మం, ఏపీలోని కృష్ణాజిల్లాలకు చెందిన భక్తులు తరలివస్తారు.

ఆలయానికి ఘన చరిత్ర..

తమ్మర దేవాలయంలో 1937 మూలవిరాట్ పక్కన పుట్టలో దొరికిన విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఇక్కడ నాలుగు పంచలోహ విగ్రహాలతో పాటు రాతి విగ్రహాలు ఉండటం ప్రత్యేకత. ఆనాడు ఆలయ అభివృద్ధి కోసం పూజారి జోలెకట్టి భిక్షాటన చేసి విరాళాలు సేకరించారని, ఆ తర్వాత గ్రామస్తులు ఉమ్మడిగా కలిసి ఆలయాన్ని ఎంతో సుందరంగా రాతితో అభివృద్ధి చేశారని చెప్పుంటారు. ఆ తర్వాత యర్రవరానికి చెందిన వీరేపల్లి రామయ్య ఆలయానికి సింహద్వార కవాటాలను చేయించారు. ఆలయ గోపురాన్ని, అష్టావాదాని చందాల కేశవదాసు నిర్మించారు. ఆలయం నిత్యం దూపదీప నైవేద్యాల కోసం నారపరాజు వెంకయ్య 5 ఎకరాల వరి పొలం, 25 ఎకరాల మెట్టభూమిని ఇచ్చారు.



అపరిశుభ్రంగా ఉన్న పుష్కరిణి

అపరిశుభ్రంగా శ్రీరామ పుష్కరిణి

ఆలయ ద్వారం ఎదురుగానే ఖమ్మం జిల్లా పైనంపల్లికి చెందిన నాగుబండి కోటయ్య పుష్కరిణిని తవ్వించారు. నవమి ఉత్సవాల్లో భాగంగా ఉత్సవమూర్తులకు చక్రతీర్థ స్నానాలు చేయించేందుకు ఈ పుష్కరిణిలోకి తీసుకువస్తారు. దీనిని శ్రీరామ పుష్కరిణిగా పిలుస్తారు. స్నానం చేయించే సమయంలో ఉత్సవమూర్తులకు ఎండ తగలవద్దనే ఆలోచనతో పుష్కరిణి మధ్యభాగంలో ఖమ్మం జిల్లా సుద్దేపల్లికి చెందిన నారపురాజు సరస్వతమ్మ రాతి మండపాన్ని నిర్మించారు. కానీ దాని నిర్వహణను ఎవరూ పట్టించుకోకపోవడంతో పుష్కరిణి ప్రాంగణం అపరిశుభ్రంగా మారింది.

ఏర్పాట్లు పూర్తి చేశాం



తమ్మరని రామాలయంలో శ్రీరామనవమికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. వేడుకకు దాదాపుగా 10 వేల మంది భక్తులు రావచ్చనే అంచనా. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తగిన సౌకర్యాలు ఏర్పాటు చేశాం. ఉత్సవ కమిటీ, గ్రామస్తుల సహకారంతో నవమి వేడుకలు వైభవంగా నిర్వహిస్తాం.

– బత్తినేని వేణుగోపాలరావు, ఆలయ చైర్మన్

శాంతిభద్రతల పరిరక్షణకు కవాతు



సిరికొండ గ్రామంలో కవాతు నిర్వహిస్తున్న సీఐఎస్‌ఎఫ్ బలగాలు, పోలీసులు

మోతె : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మోతె మండలంలోని హుస్సేన్‌బాద్, బుర్కచర్ల, సర్వారం, తుమ్మలపల్లి గ్రామాల్లో మంగళవారం మునగాల సీఐ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సీఐఎస్‌ఎఫ్ పోలీసు బలగాలతో కలిసి స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతి భద్రతల పరిరక్షణకు కవాతు నిర్వహించినట్లు తెలిపారు. ఎంపీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మోతె ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎండలు, వడగాల్పులపై జాగ్రత్తగా ఉండాలి



ఇటుక బట్టి కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న మండల వైద్యాధికారి పుష్పలత

హుజూర్‌నగర్ : ఎండలు, వడగాల్పుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ పుష్పలత అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్ పరిధిలోని ఇటుక బట్టి కూలీలకు ఆమె ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేసి మాట్లాడారు. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదు అవుతున్నందున ప్రజలు ఉదయం 10 గంటల లోపు సాయంత్రం 4 గంటల తరువాతనే ఇళ్ల నుంచి బయటకు వెళ్లాలని చెప్పారు. ఎండలో పనిచేయడం వల్ల శరీరంలోని నీరు చెమట ద్వారా డీహైడ్రేషన్ జరుగుతుందని తద్వారా వడదెబ్బ తగిలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. చెమట పట్టక పోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, వణుకు రావడం, మగతగా ఉండడం, ఫిట్స్ రావడం, పాక్షికంగా అపస్మారక స్థితిలోకి వెళ్లడం వంటి వాటిని వడదెబ్బ లక్షణాలుగా గుర్తించాలని తెలిపారు. ప్రజలు తరుచుగా మంచినీరు, మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరి నీళ్లు, పండ్ల రసాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ నూర్జహాన్ బేగం, హెల్త్ అసిస్టెంట్ ఇందిరాల రామకృష్ణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

చిలుకూరు : నల్గొండ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ చిలుకూరు మండల ఇన్‌చార్జ్ యాదా రమేష్ కోరారు. మంగళవారం చిలుకూరు మండలంలోని బేతవోలు గ్రామంలో మోదీ గ్యారంటీల పోస్టర్‌ను బీజేపీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి బత్తిని శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు రణబోతు వెంకట్‌రెడ్డి, కందరబోయిన సైదులు, అజ్మీర్ మరోజ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

హుజూర్‌నగర్ : అగ్ని ప్రమాదాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక అధికారి ఎం.శ్రీనివాసరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం హుజూర్‌నగర్ పట్టణంలోని ఆస్పత్రుల్లో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ప్రమాదంలో ఇరుకున్న వ్యక్తిని ఎలా కాపాడాలో, వారికి ఎలాంటి ప్రథమ చికిత్స అందించాలో తెలియజేశారు. అగ్ని ప్రమాదాలు జరిగిన వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 101కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది రవిబాబు, సురేందర్ రెడ్డి, సైదులు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

అనంతగిరి : సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని అనంతగిరి ఎస్ఐ ఎం.నవీన్‌కుమార్ అన్నారు. మంగళవారం అనంతగిరి మండలంలోని శాంతినగర్‌లో సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సైబర్ నేరగాళ్లు సెల్‌ఫోన్‌లకు పంపే లింక్‌లను ఓపెన్ చేయవద్దని, తెలియని లింక్స్ ఓపెన్ చేస్తే బ్యాంక్ ఖాతాలోని నగదును కేటుగాళ్లు ఖాళీ చేస్తారని అన్నారు. సైబర్ నేరగాళ్ల వలలో పడి మోసపోయిన వారు 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి

నేరేడుచర్ల : మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డులున్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని నేరేడుచర్ల ఎంపీడీఓ సోమ సుందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చిల్లేపల్లి చెరువు పూడికతీత పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఉపాధి హామీ కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఆయన వెంట ఏపీఓ శేఖర్, తదితరులు ఉన్నారు.



చిల్లెపల్లిలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ సోమ సుందర్‌రెడ్డి

నాటకరంగ అభివృద్ధికి పునరంకితం కావాలి

హుజూర్‌నగర్ : నాటకరంగ అభివృద్ధికి కళాకారులు పునరంకితం కావాలని ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు దొంతగాని సత్యనారాయణ అన్నారు. తెలుగు నాటక రంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం హుజూర్‌నగర్ పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆహ్లాదకరమైన, అద్భుతమైన, చైతన్యకరమైన కళారూపాల ద్వారా ప్రజలను జాగృతం చేయాలన్నారు. నాటక రంగ విశిష్టతను తెలియజేస్తూ వివిధ రూపాల్లో ప్రదర్శనలు నిర్వహించాలని ఆయన సూచించారు. అదే విధంగా నాటక రంగ అభివృద్ధికి కళా సంస్థలకు ప్రభుత్వం నిధులు అందించి ఆదుకోవాలని కోరారు. అర్హులైన కళాకారులకు పెన్షన్లు, ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇవ్వాలని కోరారు.

తృటిలో తప్పిన అగ్ని ప్రమాదం

నడిగూడెం : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ సమీపంలో ఉన్న కంప చెట్లకు మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. దీంతో మంటలు ఎగసిపడి కాలనీలోని ఇళ్ల వైపు వ్యాపించాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు సకాలంలో వచ్చి ప్రమాదం జరగకుండా మంటలను ఆర్పారు. దీంతో తృటిలో ప్రమాదం తప్పింది.

పార్లమెంట్ ఎన్నికల ఓబీసీ సెల్ ఇన్‌చార్జ్‌గా రామచంద్రరావు

మేళ్లచెరువు : కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల ఓబీసీ సెల్ ఇన్‌చార్జ్‌గా మేళ్లచెరువు మండల కేంద్రానికి చెందిన శెట్టి రామచంద్రరావు మంగళవారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండ కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని గెలిపించడానికి కృషిచేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతికి కృతజ్ఞతలు తెలిపారు.

‘బీజేపీ మేనిఫెస్టోలో బీసీ రిజర్వేషన్ల ఊసే లేదు’

మఠంపల్లి : బీజేపీ మేనిఫెస్టోలో బీసీ రిజర్వేషన్ల ఊసే లేదని, ఇది బీసీలకు తీరని అన్యాయమని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధూళిపాల ధనుంజయనాయుడు అన్నారు. మంగళవారం మఠంపల్లిలో సీపీఐ మండల కార్యదర్శి అమరారపు పున్నయ్యతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశ జనాభాలో సగ భాగమైన బీసీలకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ పార్టీపై ఉందన్నారు. బీసీలకు కేంద్ర బడ్జెట్‌లో ప్రతి సంవత్సరం రూ.2లక్షల కోట్ల నిధులు కేటాయించాలన్నారు. బీసీలకు ఉద్యోగాలు, స్థానిక సంస్థలు, చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు పెంచే పార్టీలను బీసీలు బలపరుస్తారని అన్నారు. అన్ని పార్టీలు బీసీలకు న్యాయం చేయాలని కోరారు.

కార్మిక సంఘం అధ్యక్షురాలు ముత్తమ్మ మృతి



ముత్తమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ మున్సిపల్ కౌన్సిలర్ కస్తాల శ్రవణ్‌కుమార్ తల్లి, మున్సిపల్ కార్మికుల సంఘం అధ్యక్షురాలు కాస్తాల ముత్తమ్మ (55) మంగళవారం గుండె సంబంధిత వ్యాధితో మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని మున్సిపల్ అధికారులు, పలువురు నాయకులు సందర్శించి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. సంతాపం తెలిపిన వారిలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, టీఎస్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి, యూనియన్ నాయకులు, మున్సిపల్ సిబ్బంది, నాయకులు, తదితరులు ఉన్నారు.

ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి

మఠంపల్లి : శ్రీరామనవమి ఉత్సవాలకు మండలంలోని వివిధ గ్రామాల్లో దేవాలయాలు ముస్తాబయ్యాయి. సాగర్ సిమెంట్స్ కాలనీలోని రామాలయంలో శ్రీసుదర్శన హోమం, పూర్ణాహుతి, కలశ ఉద్వాసన పూర్తిగావించి శ్రీసీతారాములను కల్యాణమూర్తులుగా నూతన పట్టువస్త్రాలతో అలంకరించి సిద్ధం చేశారు. మఠంపల్లి, రఘునాథపాలెం, పెదవీడు, అల్లీపురం, చౌటపల్లి, బక్కమంతులగూడెం, యాతవాకిళ్ల, వరదాపురంతో పాటు పలు గిరిజతండాల్లోనూ శ్రీసీతారాముల కల్యాణోత్సవానికి ఉత్సవ కమిటీలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

నేరేడుచర్ల : శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని రామాలయాలు ముస్తాబయ్యాయి. రాములోరి కల్యాణం కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

చిలుకూరు : శ్రీరామనవమి వేడుకలకు మండల వ్యాప్తంగా గల రామాలయాలు ముస్తాబయ్యాయి. బేతవోలులోని పురాతన శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో బుధవారం కల్యాణం అనంతరం స్వామివారి ఊరేగింపు, అదేవిధంగా పలు రామాలయాల్లో అన్నదాన కార్యక్రమాలు ఉన్నట్లు ఆలయ పూజారులు, ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు.

మునగాల : మునగాలలోని రామాలయం ముస్తాబైంది. బుధవారం సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

జర్నలిస్టుల సమస్యల షరిష్కారానికి కృషిచేస్తా

- ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి

కోదాడ : జర్నలిస్టులు వృత్తిపరంగా ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు అర్హులైన జర్నలిస్టులందరికీ ప్రభుత్వం నుంచి ఇళ్ల స్థలాలు ఇప్పించి, ఇళ్ల నిర్మాణానికి తగిన సాయం అందించడానికి కృషి చేస్తానని కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి అన్నారు. మంగళవారం కోదాడ ఐజేయూ జర్నలిస్టులు జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గింజల అప్పిరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత ఇళ్ల స్థలాలపై తగు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు జయవరపు నరేందర్, బాదె రాము, సతీష్, అలుగూరి హరినాథ్, లంకెల దశరథరెడ్డి, జూలూరి వీరభద్రం, మేకపోతుల వెంకటేశ్వర్లు, లావుడియా రమేష్, సలిగంటి మురళి, నాగరాజు, దామోదర్, పగడాల వాసు తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు పశుగ్రాసం అందజేత

గరిడేపల్లి : మఠంపల్లి మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలోని గోశాలకు గరిడేపల్లి మండల కేంద్రానికి చెందిన పెండెం సైదులు–రమణ దంపతులు ట్రాక్టర్ గడ్డిని మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో చెవుల సోమయ్య, చెవుల రాంబాబు, ఎల్లబోయిన వెంకన్న, రాధమ్మ, సైదులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని గోపాలపురంలో 1, 9, 10వ వార్డుల్లో గత పది రోజులుగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని గ్రామస్తుడు, న్యాయవాది కాల్వ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ ప్రత్యేక అధికారులు చొరవ తీసుకుని గ్రామంలో తాగునీటి సమస్యను నివారించాలని ఆయన కోరారు.

26 నుంచి మఠంపల్లిలో ఎద్దుల పందేలు

- ఎద్దుల బండలాగుడు పోటీలకు ఏర్పాట్లు
- విజేతలకు రూ.8లక్షల నగదు బహుమతులు
- పోటీలను ప్రారంభించనున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి



మాట్లాడుతున్న శుభోదయ యూత్ అధ్యక్షుడు గాదె జయభారత్‌రెడ్డి

మఠంపల్లి : మండల కేంద్రంలో గల శుభవార్త దేవాలయం (చర్చి) తిరునాళ్లను ఈనెల 25నుంచి 29వరకు నిర్వహించేందుకు చర్చి కమిటీ పెద్దలు అన్ని ఏర్పాట్లు చేశారు. తిరునాళ్ల సందర్భంగా స్థానిక శుభోదయ యూత్ ఆధ్వర్యంలో వీవీహైస్కూల్ గ్రౌండ్‌లో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఎద్దుల బండలాగుట బలప్రదర్శన (ఎడ్ల పందేలు)కు కోర్టు ఏర్పాటు పనులు మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా యూత్ అధ్యక్షుడు గాదె జయభారత్‌రెడ్డి పోటీలకు సంబంధించిన కరపత్రం విడుదల చేసి విలేకరులతో మాట్లాడారు. 25న మేరీమాత, ఏసుక్రీస్తు తిరునాళ్లు జరుగుతుందన్నారు. అనంతరం 26నుంచి 29వరకు ప్రతిరోజు ఉదయం 8గంటల నుంచి రాత్రి 10గంటల వరకు బండలాగుడు బలప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీలను రాష్ట్ర భారీ నీటి పారుదల మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, పాదర్ మార్టిన్, బ్రదర్‌లు, సిస్టర్‌లతో కలిసి ప్రారంభిస్తారని అన్నారు. ఈపోటీల్లో గెలుపొందిన ఎద్దుల జతలకు రూ.8లక్షల నగదు దాతల సహకారంతో అందజేయనున్నట్లు, ఈపోటీలు ఎద్దుల జతలను సీనియర్ విభాగం, కేటగిరి విభాగం, ఆరుపండ్ల జతలు, నాలుగు పండ్ల జతలుగా నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు 99896 96953 ,93465 16995, 74169 55725, 94400 60797లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆదూరి మధుసూదన్‌రెడ్డి, టీఆర్ బాలశౌరెడ్డి, ఆంతోనిరెడ్డి, శౌరెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, అనిల్‌చారి, జోసెఫ్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.